RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 114 | పేజీలు : 4 | మంగళవారం 27 అక్టోబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



రూ.500 కోట్ల ఆడియో కలకలం.. మహారాష్ట్ర మిత్రపక్షాల్లో మాటల మంటలు!



భారత్ నుంచి రూ.5,876 కోట్ల వస్తువులు..

- పాకిస్థాన్‌కు 69 శాతం పెరిగిన భారత వస్తువుల దిగుమతులు
- తొలి త్రైమాసికంలో దిగుమతుల విలువ రూ.5,876 కోట్లు
- పాకిస్థాన్ నుంచి భారత్‌కు నమోదు కాని దిగుమతులు
- మూడో దేశాల ద్వారా వస్తువులు చేరుతున్నాయని నిపుణుల అంచనా
- ఔషధాలు, రసాయనాలు, ఆహార ఉత్పత్తులకు డిమాండ్
- దుబాయ్, సింగపూర్, కొలంబో కీలక రవాణా కేంద్రాలుగా అనుమానం

సీఎం చంద్రబాబు కృషి వల్లే
సమన్వయం


- 'చెప్పాం.. చేస్తున్నాం' నినాదంతో స్థానిక ఎన్నికలకు వెళ్తున్నామన్న మాధవ్
- కూటమిలో కిందిస్థాయి వరకు సీట్ల సర్దుబాటు పూర్తయిందని వెల్లడి
- ప్రత్యర్థుల ఆశలకు అవకాశం ఇవ్వలేదని వ్యాఖ్య



అమరావతి

"చెప్పాం.. చేస్తున్నాం" అనే నినాదంతో రాష్ట్రంలో మంచి వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... పాలక కూటమిలోని మూడు పార్టీలు సుదీర్ఘ కసరత్తు తర్వాత ఏకతాటిపైకి వచ్చాయని, కింది స్థాయిలోనూ సమన్వయంతో సీట్ల సర్దుబాటు చేసుకుని ఎన్నికల బరిలో నిలిచామని స్పష్టం చేశారు. కూటమిలో బీటలు వస్తాయనే ప్రత్యర్థుల ఆశలకు తాము ఏమాత్రం అవకాశం ఇవ్వలేదని మాధవ్ అన్నారు. ఈ ఐక్యతతోనే సూపర్ ఎల్‌నినో వంటి సవాళ్లను అధిగమించి సుపరిపాలన అందిస్తున్నామని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరగాలనే లక్ష్యంతోనే స్థానిక ఎన్నికలకు వెళ్తున్నామని, ఇందుకు ప్రజలందరి ఆశీస్సులు - మిగతా 3లో

విద్యుత్, రవాణా పునరుద్ధరణకు
తక్షణ చర్యలు



అర్ణబ్ ఎఫెక్ట్.. ఉత్తరాంధ్రలో పూర్తిగా మారిన వాతావరణం

- పశ్చిమమధ్య బంగాళాఖాతంలో బలపడిన 'అర్ణబ్' తుపాను
- గంటకు 20 కి.మీ వేగంతో ఏపీ తీరం వైపు వేగంగా కదులుతున్న అతి తీవ్ర తుపాను
- రేపు ఉదయం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 125-135 కి.మీ. వేగంతో గాలులు



కాకినాడకు 167 కి.మీ. దూరంలో 'అర్ణబ్..
అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం
అర్ణబ్ తుపాను ముప్పుపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
కాకినాడ సమీపంలో కేంద్రీకృతమైన తుపాను
లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించాలని కలెక్టర్లకు ఆదేశం
సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాల వినియోగం

అమరావతి

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా కదులుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తుఫాను ప్రస్తుత పరిస్థితి, ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధత, ముందస్తు చర్యలపై అధికారులకు ఆయన కీలక దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఈ తుపాను కాకినాడ సమీపంలోని యానాంకు 167 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని, గత ఆరు గంటలుగా గంటకు 23 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు దూసుకొస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలపై తుపాను ప్రభావం, భారీ వర్షాల హెచ్చరికల - మిగతా 3లో



కొత్తగా రూ.1,000 నోటు వస్తోందా? వైరల్ వార్తలపై కేంద్రం కీలక ప్రకటన

- కొత్త రూ.1,000 నోటుపై వైరల్ ప్రచారాన్ని ఖండించిన పీఐబీ
- నోటు విడుదలపై ఎలాంటి ప్రకటన చేయని ఆర్‌బీఐ
- పసుపు రంగు నోటు చిత్రాలతో సోషల్ మీడియాలో ప్రచారం
- అధికారిక సమాచారం లేకుండా పోస్టులను షేర్ చేయవద్దని సూచన

గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా

- ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్
- తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీతో నీళ్లు తెస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్
- ప్రస్తుత కరవు కాంగ్రెస్ తెచ్చిన కరవు అని విమర్శ
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు డీపీఆర్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్



హైదరాబాద్

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం సాధ్యమని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, ఒకవేళ నిరూపించలేకపోతే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. గ్రావిటీతో నీళ్లు వస్తాయని ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న కరవుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని హరీశ్ ఆరోపించారు. "ఇది కాలం తెచ్చిన కరవు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నా - మిగతా 3లో



భారత్‌లో అతిపెద్ద జిల్లా ఇదే.. కొన్ని రాష్ట్రాలు, దేశాల కన్నా పెద్దది!

- దేశంలోనే అతిపెద్ద జిల్లాగా నిలిచిన గుజరాత్‌లోని కచ్
- 45,674 చ.కి.మీ విస్తీర్ణంతో ఢిల్లీ కంటే 31 రెట్లు పెద్దది
- హర్యానా, కేరళ వంటి రాష్ట్రాల కన్నా అధిక విస్తీర్ణం
- డెన్మార్క్, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్ వంటి దేశాల కన్నా విస్తీర్ణం ఎక్కువ
- ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రాణ్ ఆఫ్ కచ్, ధోలవీర వంటి ప్రాంతాలకు నెలవు

రేషన్ కార్డుదారులకు
తీపికబురు!

- రేషన్ షాపుల్లో మరిన్ని సరుకులు!
- బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు
- ధరల భారానికి చెక్.. రేషన్‌లో కిరాణా సరుకులు!
- కందిపప్పు నుంచి పామాయిల్ వరకు..
- రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులు!
- సబ్సిడీ ధరలకు సరుకుల పంపిణీకి తెలంగాణ ప్రభుత్వం కసరత్తు
- 14 నెలలకు సరిపడా సరుకుల సేకరణపై అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చ
- పెరుగుతున్న ధరల నుంచి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరట కల్పించే యోచన



హైదరాబాద్

రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో సామాన్యులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వం.. త్వరలో కందిపప్పు, గోధుమ పిండి, పంచదార, పామాయిల్ తదితర నిత్యావసర సరుకులను సైతం సబ్సిడీ ధరలకు అందించే అంశంపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. సరుకుల సేకరణ, పంపిణీ విధివిధానాలపై పౌరసరఫరాల శాఖ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు కథనం. ఎల్‌నినో పరిస్థితుల క్రమంలో తెలంగాణ ప్రభుత్వ అప్రమత్తమైంది. నివారణ చర్యలు చేపట్టేందుకు పక్కా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఎల్‌నినో కారణంగా ఈ ఏడాది రాష్ట్రంలో భారీగా - మిగతా 3లో



దుబాయ్ ఐఫోన్ కోసం కొచ్చి ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుడి నిరసన..

- దుబాయ్ నుంచి తెచ్చిన 'ఐఫోన్ 18 ప్రో'ను సీజ్ చేసిన కస్టమ్స్
- దిగుమతి సుంకం చెల్లించేందుకు నిరాకరించిన ప్రయాణికుడు
- కొచ్చి విమానాశ్రయంలో బైఠాయించి నిరసన తెలిపిన యువకుడు
- అధికారుల విధులకు ఆటంకం కలిగించాడని కేసు నమోదు

మంగళవారం 27 అక్టోబర్ 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

గోరంట్ల జడ్పిటిసి జనసేన కూటమి అభ్యర్థిగా...

గొల్ల దాసరి సునేత్ర

గోరంట్ల అక్టోబర్ 27
సీమ వార్త
సాయంత్రం.



గోరంట్ల మండల కూటమి అభ్యర్థిగా మండల జనసేన నాయకులు అనిల్ కుమార్ యాదవ్ భార్య సునేత్ర మంగళవారం జిల్లా కేంద్రంలో బీఫారాన్ని అందజేసి కూటమి తరపున అభ్యర్థిగా ఖరారు అయ్యారు. టిడిపి తరఫున జడ్పిటిసి అభ్యర్థిగా నామినేషన్ వేసిన శీనప్పల్లి రవి భార్య అధిష్టానం ఆదేశాల మేరకు విత్డ్రా చేసుకున్నారు.

గెలుపుతో తిరిగి రండి..!!



....ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచనలి

....అనంతపురం క్యాంప్ కార్యాలయంలో బీ-ఫారాల అందజేతలి

.....రెబల్స్ ఉపసంహరణ, అధికారులకు బి-ఫారాల సమర్పణపై ఎమ్మెల్యే ప్రత్యేక్ష పర్యవేక్షణలి





అనంతపురం అక్టోబర్ 27 సీమ వార్త సాయంత్రం.

బీ-ఫారాలు అందుకున్న వారంతా విజయంతో తిరిగి రావాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థులను అధికారికంగా బరిలోకి దించే ప్రక్రియను వేగవంతం చేశారు. మంగళవారం అనంతపురంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 6మండలాల ముఖ్య నాయకుల సమక్షంలో అభ్యర్థులకు పార్టీ అధికారిక బి-ఫారాలను అందజేశారు. పరిటాల కుటుంబానికి మొదటి నుంచి ఉన్న రాజకీయ సెంటిమెంట్‌ను పాటిస్తూ.. కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల ఎంపీటీసీ అభ్యర్థి బి-ఫారాన్ని గ్రామ నాయకులకు అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాధారణంగా ప్రతి ఎన్నికల ప్రచారాన్ని ముత్తవకుంట్ల గ్రామం నుంచే ప్రారంభించడం పరిటాల కుటుంబానికి ఆనవాయితీగా వస్తోందని, అదే సెంటిమెంట్‌తో ఇవాళ బి-ఫారాల పంపిణీని కూడా అక్కడి నుంచే మొదలుపెట్టామని ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేశారు. ఎన్నికల్లో కూటమి విజయావకాశాలను దెబ్బతీయకుండా ఉండేందుకు ఎమ్మెల్యే సునీత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఒకే ఎంపీటీసీ స్థానానికి పార్టీ తరఫున ఇద్దరు లేదా ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉన్న చోట, వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. పార్టీ క్రమశిక్షణ, భవిష్యత్తు అవకాశాలను వివరించారు. మిగిలిన వారితో నామినేషన్లు విత్‌డ్రా చేయించేలా స్థానిక ముఖ్య నాయకులకు దిశా నిర్దేశం చేశారు. అందరూ కలిసికట్టుగా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసమే పనిచేయాలని సూచించారు. క్యాంప్ కార్యాలయంలో బి-ఫారాలు తీసుకున్న అభ్యర్థులు, వాటిని సక్రమంగా, గడువులోగా సంబంధిత ఎన్నికల అధికారులకు అందజేశారా లేదా అనే విషయాలపై స్వయంగా పర్యవేక్షించారు. సాంకేతిక లోపాలు రాకుండా చూసుకోవాలని, నామినేషన్ల ప్రక్రియ సజావుగా ముగిసేలా ప్రతి మండలం నుంచి ముఖ్య నాయకులు బాధ్యత తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని 6మండలాల అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జీలు, ముఖ్య నాయకులు, జెడ్పిటిసి, ఎంపీటీసీ అభ్యర్థులు పాల్గొన్నారు.

పెదరాసు రాజీనామాతో.... పచ్చ"ని పార్టీకి భారీ షాక్...!!

..... తెలుగుదేశం పార్టీకి... పెదరాసు సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి లు రాజీనామా.

పెదరాసు ను జనసేన అక్కున చేర్చుకోనుందా... అదే జరిగితే కింగ్ మేకరేనా.

పుట్టపర్తి డెస్క్ అక్టోబర్ 27 సీమ వార్త సాయంత్రం.



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెదరాసు సుబ్రమణ్యం బుక్కపట్నం మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిలు ఒక్కసారిగా సంచలన నిర్ణయం తీసుకుంటూ తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. పెదరాసు కుటుంబం ఎన్నో ఏళ్లుగా కరుడుగట్టిన తెలుగుదేశం వాదిగా పార్టీకి పనిచేసిన చరిత్ర ఉంది. అలాగే జిల్లాలో బలిజ సామాజిక వర్గంలో ఒక బలమైన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఈ నేపథ్యంలో ఆయన తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పటికీ స్థానికంగా ప్రస్తుతం రాజకీయంగా సరైన స్థానాన్ని స్థానిక నాయకత్వం ఇవ్వకపోవడం తో మనస్థాపం చెందిన ఆ కుటుంబం తెలుగుదేశం పార్టీకి దూరం కావాలనే ఆలోచనకు నాంది పలికింది. దీంతో తమ రాజీనామా ఆలోచనకు పదును పెట్టి రాజీనామా పత్రాన్ని అధిష్టానానికి పంపించిన సంఘటన ఒక్కసారిగా జిల్లాలో సంచలనంగా మారింది. ఆయన లేఖలో రాసిన కొన్ని విషయాలను చూద్దాం.పెద్దరాసు సుబ్రమణ్యం అను నేను మరియు నా భార్య మాజీ ఎంపీపీ పెద్దరాసు లక్ష్మీదేవి తెలుగుదేశం పార్టీకి రాజీనామా, అయ్యా, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కరుడుకట్టిన కార్యకర్తలుగా పనిచేసిన మా కుటుంబం బాధాతప్త హృదయాలతో తీసుకున్న నిర్ణయం. శ్రీ సత్యసాయి జిల్లా, పుట్టపర్తి నియోజకవర్గంలో ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకొని నేను నా కుటుంబం పని చేస్తున్నాము.కానీ ప్రస్తుతం స్థానిక నాయకత్వంలో ఇమడలేకపోతున్న. అందువల్ల పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాము. పార్టీ జాతీయ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా మరియు ఐటి శాఖామాత్యులు నారా లోకేష్ నన్ను క్షమించి మా రాజీనామాలను ఆమోదించవలసిందిగా కోరుచున్నాము అంటూ రాజీనామా పత్రాన్ని విడుదల చేశారు. అయితే రాజీనామా అనంతరం రాజకీయ భవిష్యత్తు కోసం కీలక నిర్ణయాలు సుబ్రహ్మణ్యం కుటుంబం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. త్వరలో సుబ్రహ్మణ్యం సన్నిహితులైన నవీన్ నిచ్చల్ సారథ్యంలో జనసేనలో చేరడమే సుబ్రహ్మణ్యం కు శ్రేయస్కరమని పలువురు ఆయనకు సూచించినట్లు తెలుస్తోంది.



గౌరవ ముఖ్యమంత్రి,తెలుగుదేశం పార్టీ జాతీయాధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబునాయుడుకు గారికి

పెద్దరాసు సుబ్రమణ్యం అను నేను మరియు నా భార్య EX MPP Smt పెద్దరాసు లక్ష్మీదేవి తెలుగుదేశం పార్టీకి రాజీనామా, అయ్యా, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కరుడుకట్టిన కార్యకర్తలుగా పనిచేసిన మా కుటుంబం బాధాతప్త హృదయాలతో తీసుకున్న నిర్ణయం.

శ్రీ సత్యసాయి జిల్లా, పుట్టపర్తి నియోజకవర్గంలో ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకొని నేను నా కుటుంబం పని చేస్తున్నాము.కానీ ప్రస్తుతం స్థానిక నాయకత్వంలో ఇమడలేకపోతున్న. అందువల్ల పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాము. పార్టీ జాతీయ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా మరియు ఐటి శాఖామాత్యులు శ్రీ నారా లోకేష్ గారు నన్ను క్షమించి మా రాజీనామాలను ఆమోదించవలసిందిగా కోరుచున్నాము.

ధన్యవాదాలు

ఇట్లు,
తమ విధేయులు,
పెద్దరాసు సుబ్రమణ్యం, పెద్దరాసు లక్ష్మీదేవి,
పార్టీ ఐడి నెంబర్ 08635781,18536167.

యువ క్రికెటర్లు రాణించి జాతీయ స్థాయికి ఎదగాలి..!!

....అనంతలో ముగిసిన ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ రెండవ దశ అండర్ 15 కార్యక్రమం

.....జిల్లా వ్యాప్తంగా 500 మందికి పైగా హాజరు క్రికెట్ చరిత్రలో రికార్డు

....మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ ఆర్.డీ.టి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ

అనంతపురం, అక్టోబర్ 27-సీమ వార్త సాయంత్రం.





యువ క్రికెటర్లు రాబోవు రోజుల్లో క్రికెట్ లో రాణించి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయికి ఎదిగి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆర్డిటి సంస్థ ఇస్తున్న ప్రోత్సాహాన్ని ప్రతి ఒక్క యువ క్రికెటర్ ఉపయోగించుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లాలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించి ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ కార్యక్రమం జరుగుతున్నదని మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో మచ్చ రామలింగారెడ్డి మాట్లాడుతూ అనంతపురం జిల్లాలోని 14 కేంద్రాలలో ఆర్డిటి నిర్వహించిన రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ లో రెండవ దశలో అండర్ 15 విభాగంలో 500 మందికి పైగా క్రికెటర్లు పాల్గొన్నారు వారి ప్రతిభని సెలెక్టర్లు గమనించారని అంతకుముందు నిర్వహించిన మొదటి విడతలో రెండు వేల మంది పైగా యువ క్రికెటర్లు పాల్గొనడం జిల్లా క్రికెట్ చరిత్రలో ఇది ఒక రికార్డ్ అని భవిష్యత్తులో జిల్లాలో యువ క్రికెటర్లకు కొరత లేదని ఈ కార్యక్రమం నిరూపించిందని రాబోవు రోజుల్లో క్రికెట్లో రాణించి జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి జాతీయస్థాయి రంజీ క్రీడాకారులు కావాలన్నదే ఆర్డిటి మంచో ఫెర్రర్ లక్ష్యం అని అందుకోసం జిల్లాలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించే కార్యక్రమాన్ని మంచో ఫెర్రర్ గారు నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జిల్లాలోని యువ క్రికెటర్లందరూ ఉపయోగించుకున్నారని ఇది ఒక మంచి శుభ పరిణామం అని మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ అన్నారు అనంతపురం నగరంలోని ఆర్డిటి క్రీడా గ్రామంలోని క్రీడా మైదానం నందు ఆర్డిటి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ప్రతిభాన్వేషణ ఎంపికలను నిర్వహించింది. రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ రెండవ దశ అండర్ 15 కార్యక్రమం ముగిసింది - మిగతా 3లో

సీమ వార్త సాయంకాలం
మంగళవారం 27 అక్టోబర్ 2026

కొత్తగా రూ.1,000 నోటు వస్తోందా? వైరల్ వార్తలపై కేంద్రం కీలక ప్రకటన



దేశంలో కొత్తగా రూ.1,000 నోటు విడుదల కానుందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. ఈ వార్తల్లో నిజం లేదని, అవన్నీ నకిలీ ప్రచారాలని స్పష్టం చేసింది. కొత్త రూ.1,000 నోటు విడుదలపై 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఆర్‌బీఐ) ఎలాంటి ప్రకటన చేయలేదని వెల్లడించింది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో పసుపు రంగులో ఉన్నట్లు కనిపించే రూ.1,000 నోటు చిత్రాలు వైరల్ అయ్యాయి. కొత్త నోటును ఇప్పటికే విడుదల చేశారని, మరికొందరు నిర్దిష్ట తేదీన అందుబాటులోకి రానుందని ప్రచారం చేశారు. దీంతో కొత్త నోటు వస్తుందా? అంటూ నెటిజన్లలో చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చింది. కొత్త రూ.1,000 నోటు విడుదలైందంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా తప్పని పేర్కొంది. ఇలాంటి వార్తలను నమ్మే ముందు అధికారిక సమాచారాన్ని పరిశీలించాలని, నిర్ధారణ కాని పోస్టులను ఇతరులకు షేర్ చేయవద్దని ప్రజలకు సూచించింది. ప్రస్తుతం దేశంలో ఆర్‌బీఐ మహాత్మా గాంధీ (న్యూ) సిరీస్‌లో రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500 నోట్లు చెలామణిలో ఉన్నాయి. 2016 నవంబర్ 8న కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దును ప్రకటించినప్పుడు అప్పటివరకు చెలామణిలో ఉన్న పాత రూ.500, రూ.1,000 నోట్లు చట్టబద్ధమైన చెల్లింపుల హోదాను కోల్పోయాయి. అనంతరం కొత్త డిజైన్‌తో రూ.500 నోటును ప్రవేశపెట్టారు. అయితే, రూ.1,000 నోటును తిరిగి చెలామణిలోకి తీసుకురాలేదు. దాని స్థానంలో ప్రవేశపెట్టిన రూ.2,000 నోటును కూడా ఆర్‌బీఐ 2023 మేలో చెలామణి నుంచి ఉపసంహరించుకునే ప్రక్రియను ప్రకటించింది. కాబట్టి కొత్త రూ.1,000 నోటుపై అధికారిక ప్రకటన వచ్చిందంటూ ప్రచారం చేసే పోస్టులను ప్రజలు నమ్మవద్దని అధికారులు సూచిస్తున్నారు.

భారత్‌లో అతిపెద్ద జిల్లా ఇదే.. కొన్ని రాష్ట్రాలు, దేశాల కన్నా పెద్దది!



భారతదేశంలో భౌగోళికంగా అతిపెద్ద జిల్లా ఏదో తెలుసా? అది గుజరాత్ రాష్ట్రంలోని కచ్ జిల్లా. సుమారు 45,674 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఇది దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దీని విస్తీర్ణం ఎంత పెద్దదంటే, మన దేశ రాజధాని ఢిల్లీ కంటే ఏకంగా 31 రెట్లు అధికం. అంతేకాదు హర్యానా, కేరళ, గోవా వంటి రాష్ట్రాల మొత్తం భూభాగం కంటే కూడా కచ్ జిల్లా పెద్దది కావడం విశేషం. కచ్ జిల్లా గుజరాత్ మొత్తం విస్తీర్ణంలో దాదాపు 23 శాతం ఆక్రమించింది. కేవలం మన దేశంలోని రాష్ట్రాలతోనే కాదు, కొన్ని దేశాలతో పోల్చినా ఇది పెద్దదిగా నిలుస్తుంది. డెన్మార్క్, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, భూటాన్ వంటి దేశాల కన్నా కచ్ జిల్లా విస్తీర్ణం ఎక్కువ. ఈ గణాంకాలు కచ్ భౌగోళిక ప్రాధాన్యతను స్పష్టం చేస్తున్నాయి. అంతర్జాతీయ సరిహద్దుకు సమీపంలో సుదీర్ఘ తీర ప్రాంతాన్ని కలిగి ఉండటం ఈ జిల్లాకు వ్యూహాత్మకంగా ఎంతో కీలకం. కచ్ జిల్లా అనగానే మొదటగా గుర్తుకొచ్చేది 'గ్రేట్ రాణ్ ఆఫ్ కచ్'. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఉప్పు ఎడారుల్లో ఒకటి. వర్షాకాలంలో ఈ ప్రాంతం నీటితో నిండిపోయి, ఇతర కాలాల్లో తెల్లటి ఉప్పు పొరతో మెరిసిపోతుంది. ముఖ్యంగా శీతాకాలంలో ఇక్కడి ప్రకృతి సౌందర్యం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఈ జిల్లాకు ప్రధాన కేంద్రం చారిత్రక నగరమైన భుజ్. ఇక్కడ అనేక పురాతన రాజభవనాలు, సంప్రదాయ హస్తకళలు ప్రసిద్ధి. సింధు లోయ నాగరికతకు చెందిన ముఖ్యమైన పురావస్తు ప్రదేశం 'ధోలవీర' కూడా ఇక్కడే ఉంది. భౌగోళికంగానే కాకుండా జీవవైవిధ్యం, ఆర్థిక వ్యవస్థ పరంగానూ కచ్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి 'ఇండియన్ వైల్డ్ యాస్ శాంక్చువరీ' అడవి గాడిదలకు ఆవాసంగా నిలుస్తోంది. ఫ్లెమింగోలు వంటి ఎన్నో వలస పక్షులు శీతాకాలంలో ఇక్కడికి వలస వస్తాయి. ఆర్థికంగా ఉప్పు ఉత్పత్తి, వ్యవసాయం, పశుపోషణ, ఓడరేవు ఆధారిత కార్యకలాపాలు ఈ ప్రాంత ప్రజలకు ప్రధాన జీవనాధారం. ఈ విధంగా, కచ్ జిల్లా కేవలం విస్తీర్ణంలోనే కాకుండా చారిత్రక, సాంస్కృతిక, పర్యాటక, ఆర్థిక ప్రాముఖ్యతతో దేశంలోనే ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

భారత్ నుంచి రూ.5,876 కోట్ల వస్తువులు..

భారత్‌తో నేరుగా వాణిజ్యం చేయడంపై నిషేధం ఉన్నప్పటికీ పాకిస్థాన్‌కు భారత వస్తువులు భారీగా చేరుతున్నాయి. ఆశ్చర్యకరంగా 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత్ నుంచి పాకిస్థాన్ చేసుకున్న దిగుమతులు గత ఏడాదితో పోలిస్తే 69 శాతం పెరిగాయి. దీంతో అసలు ఈ వస్తువులు పాకిస్థాన్‌కు ఎలా చేరుతున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డాన్ పత్రిక నివేదిక ప్రకారం.. పాకిస్థాన్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ మధ్య భారత్ నుంచి 61.74 మిలియన్ డాలర్ల విలువైన వస్తువులను దిగుమతి చేసుకుంది. మన కరెన్సీలో వీటి విలువ సుమారు రూ.5,876 కోట్లు. గత ఏడాది ఇదే కాలంలో దిగుమతుల విలువ 36.55 మిలియన్ డాలర్లు మాత్రమే. మరోవైపు, ఇదే సమయంలో పాకిస్థాన్ నుంచి భారత్‌కు ఎలాంటి వస్తువుల దిగుమతులు నమోదు కాలేదు. గత ఏడాది ఏప్రిల్‌లో పహల్గామ్‌లో ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాఘా-అట్టారీ సరిహద్దు మార్గంలో వాణిజ్యాన్ని నిలిపివేయడంతోపాటు, పాకిస్థాన్‌లో ఉత్పత్తి చేసిన లేదా అక్కడి నుంచి ఎగుమతి చేసిన వస్తువులను ప్రత్యక్షంగా, పరోక్షంగా దిగుమతి చేసుకోవడంపై భారత్ నిషేధం విధించింది. పాకిస్థాన్ కూడా భారత్‌తో వాణిజ్యాన్ని నిలిపివేసింది. అయినా భారత వస్తువులు పాకిస్థాన్‌కు చేరుతుండటానికి మూడో దేశాలే మార్గంగా మారుతున్నాయని నిపుణులు భావిస్తున్నారు. దుబాయ్, సింగపూర్, కొలంబో వంటి కేంద్రాల ద్వారా వస్తువులను తరలించి, వాటి మూల దేశాన్ని వేరుగా చూపించే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే తాజాగా నమోదైన దిగుమతుల గణాంకాలు ఏ మార్గంలో వస్తువులు చేరాయన్న విషయాన్ని స్పష్టంగా వెల్లడించడం లేదు.

ఏ వస్తువులకు డిమాండ్?

భారత్ నుంచి పాకిస్థాన్‌కు ప్రధానంగా ఔషధాలు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, పెట్రోలియం ఉత్పత్తులు, రసాయనాలు, రబ్బరు, కాఫీ, టీ, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, పాల ఉత్పత్తులు, తృణధాన్యాలు వెళ్తున్నాయి. ముఖ్యంగా ఔషధాల తయారీకి అవసరమైన ముడి పదార్థాల కోసం పాకిస్థాన్‌కు భారత్ కీలక సరఫరాదారుగా ఉంది. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) అంచనా ప్రకారం.. మూడో దేశాల ద్వారా జరిగే అనధికారిక భారత ఎగుమతుల విలువ ఏడాదికి 10 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చు. అయితే ఇది అంచనా మాత్రమే. నిషేధం ఉన్నప్పటికీ వాణిజ్యం ఎలా కొనసాగుతోందన్న దానిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. భారత్-పాకిస్థాన్ మధ్య అధికారిక వాణిజ్యం దాదాపు నిలిచిపోయినా, భారత వస్తువులకు పాకిస్థాన్‌లో డిమాండ్ కొనసాగుతోందని తాజా గణాంకాలు సూచిస్తున్నాయి. నిషేధాలను తప్పించుకుని వస్తువులు చేరుతున్నాయా? అలా అయితే వాటిని అడ్డుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా

-మొదటిపేజీ తరువాయి

ఎత్తిపోతలు చేపట్టకుండా ప్రభుత్వం రైతులను నష్టపరుస్తోందని విమర్శించారు. 33 శాతం వర్షపాతం లోటు ఉన్న ఏపీలో లేని క్రాప్ హాలిడే, కేవలం 17 శాతం లోటు ఉన్న తెలంగాణలో ఎందుకు ప్రకటించారని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టి, కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారని, అసలు ఆ ప్రతిపాదనకు సంబంధించిన డీపీఆర్‌ను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. తుమ్మిడిహెట్టి వద్ద తగినంత నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం స్పష్టం చేసిన తర్వాతే, తమ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని ఆయన గుర్తుచేశారు.

రేషన్ కార్డుదారులకు సర్కారు తీపికబురు!

-మొదటిపేజీ తరువాయి

లోటు వర్షపాతం నమోదైంది. వచ్చే ఏడాదిలో కూడా ఇదే పరిస్థితులు ఉంటాయనే అంచనాలు వాతావరణశాఖ నుంచి వస్తుండటంతో మరింత క్లిష్టతర పరిస్థితులు ఎదురుకానున్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పండకపోవడంతో నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయి. దీంతో సామాన్యులపై పెను భారం పడుతోంది. ఈ క్రమంలో సామాన్యులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. రేషన్ కార్డులు ఉన్నవారికి ప్రస్తుతం సన్నబియ్యం అందిస్తుండగా.. త్వరలో నిత్యావస సరుకులు కూడా అతి తక్కువ ధరకు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసేందుకు కసరత్తులు చేస్తోంది. ఎల్‌నినోతో కరువు పరిస్థితులు, నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండటంతో సామాన్యులకు భారం తగ్గించే చర్యలు ప్రభుత్వం చేపడుతోంది. అందులో భాగంగా రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను త్వరలో అందించేందుకు సమాయత్తం అవుతోంది. బియ్యంతో పాటు కందిపప్పు, గోధుమ పిండి, షుగర్, పామాయిల్, చింతపండు, కారంపొడి వంటి ఇంట్లోకి అవసరమయ్యే కిరాణా సరుకులను అతి తక్కువ ధరకే అందించనుంది. రేషన్ కార్డులు ఉన్నవారు వీటిని బియ్యంతో పాటు తీసుకోవచ్చు. దీని వల్ల సామాన్యులకు ఇంటి బడ్జెట్ తగ్గడం వల్ల డబ్బులు ఆదా అవుతాయి. ఇటీవల హైదరాబాద్‌లో పౌరసరఫరాల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశమయ్యారు. నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమంపై చర్చించారు. ఈ కార్యక్రమం ప్రారంభించేందుకు ముందుగా సరుకులను సేకరించడంపై చర్చించారు. 14 నెలలకు సరిపడ సరుకులను సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సరుకులను సిద్ధం చేసుకున్న తర్వాత ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించాలని యోచిస్తోంది. ఆహార కొరతను తీర్చడంతో పాటు పేద, మధ్యతరగతి ప్రజలకు ధరల భారాన్ని తగ్గించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడనుంది. అటు ఇప్పటికే ఏపీలో బియ్యంతో పాటు గోధుమ పిండి, కందిపప్పు, పంచదార, పామాయిల్ వంటి సరుకులను రేషన్ షాపుల ద్వారా అందించే కార్యక్రమాన్ని ఇటీవల నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఇదే తరహా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ఎల్‌నినో పరిస్థితుల నుంచి ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి.

దుబాయ్ ఐఫోన్ కోసం కొచ్చి ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుడి నిరసన..



దుబాయ్ లో కొనుగోలు చేసిన సరికొత్త 'ఐఫోన్ 18 ప్రో'ను కస్టమ్స్ అధికారులు సీజ్ చేయడంతో ఓ ప్రయాణికుడు కొచ్చిలోని నెడుంబస్సేరి విమానాశ్రయంలో నిరసనకు దిగాడు. దిగుమతి సుంకం (ఇంపోర్ట్ డ్యూటీ) చెల్లింపు విషయంలో తలెత్తిన వివాదంతో అతను అక్కడే బైఠాయించి ధర్నా చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై అధికారులు అతనిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కోజికోడ్‌కు చెందిన అజాస్ మహ్మద్, ఎడ్యుపోర్ట్ అనే లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ వ్యవస్థాపకుడు. ఇటీవల దుబాయ్ నుంచి కొచ్చి విమానాశ్రయానికి చేరుకున్నాడు. తన వెంట తెచ్చుకున్న కొత్త ఐఫోన్ 18 ప్రోకు దిగుమతి సుంకం చెల్లించాలని కస్టమ్స్ అధికారులు కోరారు. అయితే, ఆ ఫోన్‌ను తన వ్యక్తిగత అవసరాల కోసమే తెచ్చుకున్నానని, దానికి సుంకం చెల్లించాల్సిన అవసరం లేదని అజాస్ వాదించాడు. తన వద్ద ఇప్పటికే మరో ఫోన్ ఉందని అధికారులు సుంకం డిమాండ్ చేస్తున్నారని ఆరోపించాడు. తాను "అన్యాయంగా ఒక్క రూపాయి కూడా కట్టబోనని" స్పష్టం చేశాడు. తనలాగే కొత్త ఫోన్లు తెచ్చుకున్న ఇతర ప్రయాణికులు రూ.20,000 నుంచి రూ.30,000 వరకు సుంకం చెల్లించారని, కానీ తాను మాత్రం అన్యాయమైన పన్ను కట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పాడు. ఫోన్‌ను తిరిగి ఇచ్చేంతవరకు శాంతియుతంగా విమానాశ్రయంలోనే నిరసన తెలుపుతానని అక్కడే బైఠాయించాడు. దీంతో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సిబ్బంది అతన్ని అక్కడి నుంచి పక్కకు తరలించారు. అనంతరం కస్టమ్స్ అధికారుల విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలతో నెడుంబస్సేరి పోలీసులు అజాస్‌పై కేసు నమోదు చేశారు. మరోవైపు, కస్టమ్స్ అధికారులు అజాస్ వాదనను అంగీకరించలేదు. అతని వద్ద ఇప్పటికే మరో ఐఫోన్ ఉండటం, కొత్తగా తెచ్చిన హ్యాండ్‌సెట్ రిజిస్టర్ కాకపోవడం వంటి కారణాలతో అది వ్యక్తిగత వినియోగానికి కాదని భావించారు. భారత బ్యాగేజ్ రూల్స్-2026 ప్రకారం అర్హులైన ప్రయాణికులు సుమారు రూ.75,000 విలువైన వస్తువులను సుంకం లేకుండా దేశంలోకి తీసుకురావచ్చు. ఈ పరిమితిని అధికారులు ప్రస్తావించినట్లు తెలిసింది. అయితే, ఈ నిర్దిష్ట కేసులో ఫోన్‌ను సీజ్ చేయడానికి గల కచ్చితమైన చట్టపరమైన కారణాలపై కస్టమ్స్ విభాగం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం ఈ వివాదం కొనసాగుతోంది.

విద్యుత్, రవాణా పునరుద్ధరణకు తక్షణ చర్యలు

-మొదటిపేజీ తరువాయి

గురించి సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు అవసరమైన ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. తుపాను ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని, ఈదురు గాలులకు చెట్లు, హోర్డింగులు కూలిపోతే తక్షణమే తొలగించి రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉన్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, తక్షణమే స్పందించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

అర్ణబ్ ఎఫెక్ట్.. ఉత్తరాంధ్రలో పూర్తిగా మారిన వాతావరణం

పశ్చిమమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' అతి తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. గడిచిన 6 గంటల్లో గంటకు 20 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న ఈ తుపాను, ప్రస్తుతం విశాఖపట్నానికి 170 కి.మీ., కాకినాడకు 180 కి.మీ., మచిలీపట్నానికి 270 కి.మీ., బాపట్లకు 350 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో వాతావరణం పూర్తిగా మారిపోయింది. 'అర్ణబ్' ప్రభావంతో ఇప్పటికే శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ, అనకాపల్లి, కోనసీమ జిల్లాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఈరోజు సాయంత్రం నుంచి పోలవరం, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తుపాను రేపు (బుధవారం) ఉదయానికి బాపట్ల-విశాఖపట్నం మధ్య, యానాంకు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ, "తుపాను తీరం దాటే సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి" అని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. అధికార యంత్రాంగం సహాయక చర్యల కోసం సర్వసన్నద్ధంగా ఉంది.

సీఎం చంద్రబాబు కృషి వల్లే సమన్వయం



-మొదటిపేజీ తరువాయి

కావాలని కోరారు. ఈ స్థానిక ఎన్నికలు ఎంతో కీలకమైనవని మాధవ్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సమన్వయం చాలా గొప్పగా ఉందని కొనియాడారు. సార్వత్రిక ఎన్నికల్లో చూపిన ఐక్యతతోనే స్థానిక సమరంలోనూ కలిసికట్టుగా ముందుకు వెళ్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సీమ వార్త సాయంకాలం

మంగళవారం 27
అక్టోబర్ 2026

గోరంట్ల మండల పరిషత్ బరిలో...
బరి కీ సరైన తెలుగు తమ్ముళ్లు

22 కు గాను 21 స్థానాల్లో పోటీకి సై.. 1 స్థానంలో బిజెపి పోటీ.

.....4 స్థానాల్లో టిడిపి జనసేన అభ్యర్థులకు ఇరువురికి బీ ఫారాలు.

....4 స్థానాల్లో పొత్తు ధర్మంలో కుదరని ఏకాభిప్రాయాలు... పోటా పోటీ బి ఫారాలు అందజేత.



గోరంట్ల అక్టోబర్ 27 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండల పరిషత్ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరుగుతున్న ఎన్నికల్లో మండలంలోని 22 ఎంపీటీసీ స్థానాలకు గాను 21 చోట్ల పార్టీ అభ్యర్థులను బరిలకు దింపుతూ ఆ అభ్యర్థులకు పార్టీ అధిష్టానం బీ ఫారాలు అందజేయడం జరిగింది. కూటమి పొత్తుల భాగంగా గోరంట్ల లో ఒక ఎంపీటీసీ స్థానాన్ని బిజెపికి కేటాయించడం జరిగింది. అయితే అదే కూటమిలో భాగంగా తెలుగుదేశం పార్టీ జనసేన మధ్య అభ్యర్థుల ఎంపిక మరియు ఏకాభిప్రాయాల్లో తేడాలు రావడంతో మండలంలోని నాలుగు స్థానాల్లో టిడిపి జనసేన అభ్యర్థులకు రెండు పార్టీలు బి ఫారాలు ఇవ్వడం చర్చ నియాంశంగా మారింది.

బరిలో నిలిచిన టిడిపి అభ్యర్థులు వీళ్లే.....

గోరంట్ల మండలంలోని 22 ఎంపీటీసీ స్థానాల పోటీలో.... గోరంట్ల 1 వ ఎంపీటీసీ అభ్యర్థిగా కక్కల రఘునాథ్ రెడ్డి, 2 వ ఎంపీటీసీ అభ్యర్థిగా దేవాంగం శ్రీనివాసులు, 3 వ ఎంపీటీసీ అభ్యర్థిగా బిజెపి పార్టీకి చెందిన మేదర శ్రీనివాసులు, 4 వ ఎంపీటీసీ అభ్యర్థిగా సాహిదా, 5 వ ఎంపీటీసీ అభ్యర్థిగా సింగిరెడ్డిపల్లి నందిని అలాగే మండలంలోని బూదిలి ఎంపీటీసీగా శ్రావణి, గంగంపల్లి ఎంపీటీసీగా జితేంద్ర నాయక్, గౌని వారి పల్లి ఎంపీటీసీగా విజయలక్ష్మి, కమ్మవారిపల్లి ఎంపీటీసీగా లక్ష్మీ దేవమ్మ, కొండాపురం ఎంపీటీసీగా కవిత, మల సముద్రం ఎంపీటీసీగా రంగయ్య, మల్లాపల్లి ఎంపీటీసీగా భారతి, మందలపల్లి ఎంపీటీసీగా సావిత్రమ్మ, నార్సింపల్లి ఎంపీటీసీగా నాగభూషణ, పాలసముద్రం ఎంపీటీసీగా సంధ్య, పుట్టగుండ్లపల్లి ఎంపీటీసీగా శారద భాయ్, రెడ్డి చెరువు పల్లి ఎంపీటీసీగా నిడిమామిడప్ప, వడిగేపల్లి ఎంపీటీసీగా సన్నప్ప , వానవోలు 1 వ ఎంపీటీసీగా లక్ష్మీనారాయణ, 2 వ ఎంపీటీసీగా నారాయణప్ప, వెంకటరమణ పల్లి జినం నరేష్ కుమార్ లు బీఫారాలు తీసుకొని బరిలో నిలిచారు. అయితే ఇందులో నాలుగు స్థానాల్లో పొత్తులో చర్చలు సఫలం కాకపోవడంతో టిడిపి పోటీ చేస్తున్న జనసేన పార్టీ నుంచి నాలుగు స్థానాల్లో జనసేన సైతం పోటీకి సిద్ధమైంది.

పోటాపోటీగా నాలుగు స్థానాలు టిడిపి జనసేన...

మండలంలో టిడిపి జనసేన పొత్తు వికటించి నాలుగు స్థానాల్లో జనసేన పోటా పోటీకి సిద్ధమైంది ఇందులో భాగంగా గోరంట్ల 1 వ ఎంపీటీసీ స్థానం నుంచి పాగుతోట వెంకటేష్, కమ్మవారి పల్లి ఎంపీటీసీగా లక్ష్మి, గౌని వారి పల్లి ఎంపీటీసీగా అలివేలమ్మ, మందలపల్లి ఎంపీటీసీగా శిల్పలు జనసేన పార్టీ అధిష్టానం నుంచి బీఫారాలు తీసుకొని పోటాపోటీగా బరిలో దిగారు. అయితే గోరంట్ల మండల జడ్పిటిసి స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో టిడిపి అభ్యర్థిగా బరిలో నిలిచిన సీనప్పపల్లి రవి భార్య అధిష్టానం ఆదేశాల మేరకు నామినేషన్ విత్ డ్రా చేసుకోవడం జరిగింది.

మండల పరిషత్ బరిలో నిలిచిన... వైసిపి అభ్యర్థులు.

22 స్థానాల్లో బలమైన పోటీకి బలమైన అభ్యర్థుల ఎంపిక.. జడ్పిటిసి బరిలో పులేరు ఆరిఫా.





గోరంట్ల అక్టోబర్ 27 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండల ఎంపిటిసి ఎన్నికల బరిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీకి మేము సైతం అంటూ బరిలో నిలిచారు.నగోరంట్ల మండలంలోని 22 ఎంపీటీసీ స్థానాలకు 22 స్థానాలకు అధికార పార్టీ అభ్యర్థులను దీటుగా ఎదుర్కొనే విధంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. వీరితోపాటు మండల జడ్పిటిసి అభ్యర్థిగా పూలేరు కు చెందినఅరిఫా జడ్పిటిసి బరిలో నిలిచారు.

బరిలో నిలుస్తున్న 22 మంది అభ్యర్థులు వీళ్లే..... మండలంలోని 22 స్థానాల్లో లో భాగంగా గోరంట్ల 1 వ ఎంపీటీసీకి కురుబ సత్యనారాయణ,
2 వ ఎంపిటిసి కి జొన్న ఆంజనేయులు,
3 వ ఎంపిటిసి కి పఠాన్ నూరి, 4 వ ఎంపీటీసీకి మేదర శంకర, 5 వ ఎంపిటిసి కి గొల్ల కళావతి, 6 వ ఎంపీటీసీకి పుష్పవతి అలాగే మండలంలోని మందలపల్లి ఎంపీటీసీగా కృష్ణవేణి, గౌని వారి పల్లి ఎంపీటీసీగా అశ్విని, పాలసముద్రం ఎంపీటీసీగా మునీశ్వరమ్మ, మల సముద్రం ఎంపీటీసీగా రామచంద్రప్ప, కొండాపురం ఎంపీటీసీగా లక్ష్మీనరసింహ,వానవోలు 1 వ ఎంపీటీసీగా సత్యనారాయణ, వానవోలు 2 వ ఎంపీటీసీగా జయశ్రీ, గంగంపల్లి ఎంపీటీసీగా లీలాబాయి, కమ్మవారి పల్లి ఎంపీటీసీగా గౌరమ్మ, వెంకటరమణ పల్లి ఎంపీటీసీగా సవిత, బూదిలి ఎంపీటీసీగా నాగజ్యోతి, నార్సింపల్లి ఎంపీటీసీగా నాగభూషణ్ రెడ్డి, వడిగేపల్లి ఎంపీటీసీగా నాగరాజు, రెడ్డి చెరువు పల్లి ఎంపీటీసీగా ఆనంద్, మల్లాపల్లి ఎంపీటీసీగా లక్ష్మీ దేవమ్మ, పుడగుండ్లపల్లి ఎంపీటీసీగా శారద భాయ్ లను వైసిపి అధిష్టానం ఎన్నికల బరిలోకి దింపింది.

5 ఎంపీటీసీ లు ఏకగ్రీవం టీడీపీ కైవశం.

8 ఎంపీటీసీ లకు ఎన్నికలు.

ఎన్నికల పోటీలో 16 మంది అభ్యర్థులు.

14 నామినేషన్లు ఉపసంహరణ---- రిటర్నింగాధికారి సి. సూర్యనారాయణ.



చెన్నేకొత్తపల్లి అక్టోబర్ 27, (సీమ వార్త): స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఎంపీటీసీ అలాగే జడ్ పి టి సి స్థానాలకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ రోజు కావడంతో 14 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు అని రిటర్నింగ్ అధికారి సి సూర్యనారాయణ, సహాయక రిటర్నింగ్ అధికారి బాలకృష్ణుడు లు పాత్రికేయులకు తెలియ చేసారు. మండలంలోని 13 ఎంపీటీసీ స్థానాలకు గాను టీడీపీ 5 ఎంపీటీసీ స్థానాలను ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నదని అన్నారు. ఇందులో బసంపల్లి ఎంపీటీసీ మద్దిలేటి రమణ, చెన్నేకొత్తపల్లి రెండవ ఎంపీటీసీ నాగరాజు, మేడాపురం ఒకటవ ఎంపీటీసీ పసల లక్ష్మీకాంత, నాగసముద్రం ఎంపీటీసీ దండు ఓబులేసు, వెంకటంపల్లి ఎంపీటీసీ వై.అరుణ లు ఏకగ్రీవంగా టీడీపీ కైవసం చేసుకున్నారు.ఎన్నికల పోటీలో చెన్నేకొత్తపల్లి ఒకటవ ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరపున మాడెం సూర్యనారాయణరెడ్డి, వైసిపి తరపున దుర్గంపూడి శ్రీనివాసరెడ్డి, గంగినేపల్లి ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరపున శీలం ఫణీంద్ర, వైసిపి తరపున చిల్లా శివయ్య, ఓబులంపల్లి ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరపున ఏజ్జే మల్లమ్మ, వైసిపి తరపున డోలా ఆదిలక్ష్మమ్మ, న్యామద్దెల ఒకటవ ఎంపీటీసీ స్థానానికి రాములమ్మ వైసిపి తరపున ఈశ్వరమ్మ, న్యామద్దెల రెండవ ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరపున కత్తే పెద్దన్న,వైసిపి తరపున బిల్లె అనసూయ, ప్యాధిండి ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరపున గుజ్జూరి కల్యాణి వైసిపి తరపున పూజారి గంగమ్మ, ముష్టి కోవెల ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరపున బూడిద నాగలక్ష్మమ్మ, వైసిపి తరపున తలారి జ్యోతి, మెడాపురం రెండవ ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరపున వెట్టి నరసింహమూర్తి,వైసిపి తరపున పులేటిపల్లి మల్లికార్జున లు ఎన్నికల పోటీలో వున్నారని, వీరిలో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థులు 8, అలాగే వైసిపి ఎంపీటీసీ అభ్యర్థులు 8 మంది మొత్తం 16 మంది ఎంపీటీసీ అభ్యర్థులు ఎన్నికల పోటీలో వున్నారని వారు తెలియ చేశారు.

రేపు శ్రీ పద్మావతి క్లినిక్ ప్రారంభోత్సవం

ఓ డి చెరువు వైఎస్ఆర్ సర్కిల్‌లో నూతన వైద్యశాల ఏర్పాటు

ఓబులదేవరచెరువు, (అక్టోబర్27):సీమవార్త సాయంకాలం:శ్రీ సత్యసాయి జిల్లా ఓబులదేవరచెరువు మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ పద్మావతి క్లినిక్, మెడికల్స్ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు డాక్టర్ మనోహర్ తెపల్లే తెలిపారు.శ్రీ పద్మావతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో కంపాషన్ కేర్ హెల్త్ యూనిట్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ.. మానవాళికి సేవ చేయడం,ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం అనే ప్రధాన లక్ష్యాలతో శ్రీ పద్మావతి క్లినిక్, మెడికల్స్ ద్వారా కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు.ఈ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమం అక్టోబర్ 29వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్య నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు, వైద్య రంగానికి చెందిన వారు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.



కార్యకర్తల ఆవేదనే దాడులకు కారణం..!!

...తాడిపత్రిలో అర్ధరాత్రి దాడుల కలకలం

....ఆ గొడవలకు మాకు సంబంధం లేదు.. టీడీపీ కార్యకర్తల ఆవేదనే దాడులకు కారణం - జేసీ క్లారిటీలి

....వైసీపీ ప్రభుత్వంలో టీడీపీని వేధించారు.. ఇప్పుడు ఆ ఆవేదనతోనే దాడులు - జేసీ.



తాడిపత్రి అక్టోబర్ 27, సాయంకాలం (సీమవార్త): తాడిపత్రి పట్టణంలో ఇటీవల చోటుచేసుకుంటున్న రాజకీయ ఘర్షణలు, దాడుల ఘటనలపై మాజీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి స్పందించారు. తాడిపత్రి పట్టణంలో అయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ గొడవలకు తమకు, తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారని, అక్రమ కేసులు పెట్టించి వేధించారని ఆరోపించారు. ఆ ఐదేళ్ల అణచివేత, ఆవేదనతోనే నేడు టీడీపీ కార్యకర్తలు తిరగబడి దాడులు చేస్తున్నారని, ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదని జేసీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అదే సమయంలో వైసీపీ నాయకులకు జేసీ ప్రభాకర్ రెడ్డి గట్టి హెచ్చరిక చేశారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని నమ్ముకుంటే వైసీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన ఇద్దరు కుమారులు ఎప్పటికీ బాగానే ఉంటారని, అలాగే మేము మా కుటుంబ సభ్యులు కూడా బాగానే ఉంటామని, మధ్యలో నష్టపోయేది మాత్రం నాయకులను నమ్ముకుని వారి వెంట తిరిగే అమాయక కార్యకర్తలు మాత్రమేనని వ్యాఖ్యానించారు. దీనికి ఉదాహరణగా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన ఫయాజ్ బాషా ఉదంతాన్ని ప్రస్తావించారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని నమ్ముకుని ఫయాజ్ బాషా మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ వేశారని, నామినేషన్ వేసిన మరుక్షణం నుంచి కేతిరెడ్డి, ఆయన కుమారులు కనబడటం మానేశారని, ఫయాజ్ బాషాకు చేదు అనుభవం ఎదురైందని ఎద్దేవా చేశారు. కాబట్టి వైసీపీ నాయకులారా ఇప్పటికైనా కళ్లు తెరవండి, కేతిరెడ్డి పెద్దారెడ్డిని నమ్ముకోకుండా మీరు మీ సొంత రాజకీయం చేసుకోండి అంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి హితవు పలికారు.

యువ క్రికెటర్లు రాణించి జాతీయ స్థాయికి ఎదగాలి..!!

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, ఆర్‌డిటి క్రికెట్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మచ్చా రామలింగారెడ్డి, సెలెక్టర్లు యోగానంద , విజయ్ రాజు, రాజేశ్వరి, హరినాథ్ రెడ్డి, రఫీ రాజశేఖర్ ఈనాయతుల్లా ఆర్‌డిటి గ్రాస్‌రూట్స్ కోఆర్డినేటర్ కె.ప్రవీణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మచ్చా రామలింగారెడ్డి యువ క్రికెటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఆర్‌డిటి ఈ నూతన చొరవ తీసుకుందని, ప్రతిభాన్వేషణ కోసం అనంతపురం నగరంలోని చుట్టుపక్క ప్రాంతాల్లో ఉన్నటువంటి యువ క్రీడాకారులు సమావేశమవడం ఆనందంగా ఉందని, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారి నైపుణ్యాలను మెరుగుపరచడానికి కోచింగ్ శిబిరాలకు పంపుతాము అని తెలిపారు. అనంతపురం నుంచి ప్రతిభ ఉన్న ఎందరో క్రికెటర్లు ఆర్డిటి స్టేడియం ను ఉపయోగించుకొని రంజీ ట్రోఫీ ఆటగాళ్లు కాగలిగారని, టాలెంట్ హంట్ ఎంపికల ద్వారా ప్రతిభావంతులైన ఆటగాళ్లను గుర్తిస్తున్నామని, గ్రామీణ ప్రతిభావంతులైన ఆటగాళ్లకు సరైన క్రికెట్ సౌకర్యాలను వినియోగించుకునేలా చూడటానికి మాజీ భారత, ఆంధ్ర ఆటగాళ్లతో కలిసి రాష్ట్ర జట్ల శిబిరాల వంటి శిబిరాలను నిర్వహించాలనుకుంటున్నామని మచ్చా రామలింగారెడ్డి అన్నారు. గ్రామీణ ప్రతిభను ప్రోత్సహించి, వారికి మరింత శిక్షణ ఇవ్వడమే మోంచో ఫెర్రర్ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి క్రికెట్ కోచ్లు అనంతపురం ఆర్ డి టి కోచ్ ఇనైతుల్లా రఫీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో మొత్తం 90 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు.

పాలసముద్రంలో పరుగులు పెట్టించిన... తెలుగు తమ్ముళ్ల ప్రచారం.



గోరంట్ల అక్టోబర్ 27 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండలంలోని పాలసముద్రం గ్రామంలో మంగళవారం టిడిపి ఎంపిటిసి అభ్యర్థి సంధ్య మూర్తి ఆధ్వర్యంలో తొలి రోజు ఇంటింటి ప్రచారాన్ని పరుగులు పెట్టించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాల కాలంలో అభివృద్ధి రెట్టింపు స్థాయిలో పరుగులు పెడుతోందని ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. అభ్యర్థి భర్త మూర్తి తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడై కోనేరుగా పార్టీలో క్రియాశీలకంగా ఉండడంతో పాటు స్థానిక ప్రజలు పట్టు ఉండడంతో వాళ్ల ప్రచారానికి ప్రజాదరణ లభిస్తోంది.

కారు కంటైనర్ డి ఒకరు మృతి.

క్రేడ్స్ స్కూల్ సమీపంలోని బైపాస్ వద్ద ప్రమాదం... బెంగళూరు వాస్తులకు గాయాలు.



గోరంట్ల అక్టోబర్ 27 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల పట్టణ సమీపంలోని క్రెడ్స్ స్కూల్ సమీపంలో గల నూతన బైపాస్ రోడ్డు వద్ద మంగళవారం కారు కంటైనర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ప్రమాదంలో బెంగళూరు చెందిన ప్రభావతి (53) అక్కడికక్కడే మృతి చెందారు.ఈ ప్రమాదంలో అనిల్, పవన్, రామకృష్ణుడు స్వల్పంగా గాయపడ్డారు.

బాధితులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. బాధితులు బెంగళూరు నుంచి తన సొంత పనుల నిమిత్తం ధర్మవరం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్టు తెలిపారు. గాయపడ్డ వారికి గోరంట్ల ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్సలు అందజేశారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881